

మహర్షులకు మంత్ర శక్తి ఉన్నట్టే..
మహాత్ముడికి మాట శక్తి ఉంది.
ఆయన పలుకు పదునైన రామబాణం.
నేరుగా మనసును తాకుతుంది. ఆలోచనలను
ప్రభావితం చేస్తుంది. ఆచరణ దిశగా అడుగులు
వేయిస్తుంది. స్వాతంత్ర్యోద్యమ సమయంలో
జాతిమొత్తం ఆ మాటకే కట్టుబడి ఉంది.
నిరాహారదీక్ష చేయమంటే చేసింది.
నూలు వడకమంటే వడికింది. ఖద్దరు ధరించ
మంటే ధరించింది. జైలుకెళ్ల మంటే వెళ్లింది.
నిరసనలు తెలపమంటే తెలిపింది.
మహోద్ధృతంగా సాగిపోతున్న ఉద్యమాన్ని
ఆపేయమని చెప్పగానే.. ఠక్కున ఆపేసింది.

కవర్ స్టోరీ

# మాటే మంత్రం!

అదీ గాంధీజీ మాటకున్న శక్తి.
ఆ వాక్శుద్ధి నిబద్ధతతో వస్తుంది.
సత్యవాక్య పాలనతో ప్రామాణికత సాధిస్తుంది.
నాయకత్వగుణంతో పదునుదేలుతుంది.
అలా అని, ఆ మాటల్లో సుదీర్ఘ సమాసాలు ఉండవు. సంస్కృత పదాల పోహళింపూ కనిపించదు. ఆంగ్లపదాలు గుప్పించిన దాఖలాలు ఉండవు.
భాష.. సరళంగా ఉంటుంది. ఆయన కొల్లాయిలా, ఆయన జీవన విధానంలా.

భావానికి మాత్రం ఎంతో లోతు. ఆయన బోసి నవ్వులా, ఆయన చురుకైన చూపులా.

కస్టమర్ సేవలు మొదలు సాంకేతిక పరిజ్ఞానం వరకు మహాత్ముడు చర్చించని విషయం లేదు.

మానవ హక్కుల నుంచి జీవరాశి కారుణ్యం వరకూ ప్రబోధించని సత్యం లేదు.

రామాయణ–భారత– భగవద్గీతలే కాదు.. బౌద్ధం, క్రైస్తవం, ఇస్లాం.. ప్రతి ధర్మంలోని మంచిని ఒడిసిపట్టి అందించారు. చెప్పిందే చేశారు. చేసిందే చెప్పారు. కాబట్టే, ఆయన జీవితమే ఆయన సందేశమైంది. ఆయన ప్రతి వాక్కు ఒక సూక్తిగా నిలిచిపోయింది.

మంచిచెడుల మధ్య తూకం వేయాల్సి వచ్చినప్పుడు.. ధర్మాధర్మ విచక్షణ సన్నగిల్లినప్పుడు.. ఏదారి ఎంచుకోవాలో తెలియనప్పుడు, రెండు వాదాల్లో దేనికి ఓటేయాలో అర్థం కానప్పుడు.. ఆయనను తలుచుకుంటే చాలు.
నిజం నిగ్గుదేలుతుంది.

అందులోనూ మనం సంధియుగంలో ఉన్నాం. మంచిని చెడు మింగేస్తున్న దశ. అజ్ఞానం జ్ఞానాన్ని ఆక్రమించేస్తున్న తరుణం. నైతికతను అనైతికత నమిలేస్తున్న పరిస్థితులు. ఇప్పుడు.. మహాత్ముడి అడుగుజాడలే మనకు దారిదీపాలు. బాపు మాటలే బంగారు బాటలు. ఆ విలువల యాత్రకు తగినంత ఆత్మబలాన్ని ఇవ్వమని 'గాంధీ జయంతి' సందర్భంగా ప్రార్థిద్దాం.